సీరియల్

ముద్దా సురేష్

(పదహేడవ భాగం)

సెకండ్ల ముల్లు 50 అంకె చేరుకుంది. యింకా పది సెకండ్లు.

తొమ్మిది....

రాణా గొంతు తడారిపోయింది.

ఏడు .... ఐదు .... రెండు ....

ఒకటి....

రాణా వంగి, రెండు చేతుల మధ్యా తలదాచుకున్నాడు. సుబేదార్ మాట త్రిప్పటం చూడ్డం యిష్టం లేక.

అంతే!

బ్రహ్మాండమైన ప్రేలుడు!....

భూమి అదిరే విస్ఫోటం....

హోరున శబ్దం....

దొర్లుతున్న కొండరాళ్ళ చప్పుడు....

చెవులు పగలగొడుతూ పిడుగులు దొర్లే ధ్వని.

రాణా చేతుల్లో తలవంచుకుని కూర్చున్నాడు ఎగిరే కొండరాళ్ళు మీద పడ్తాయన్న భయంతో.

అలాంటిదేమీ జరగలేదు.

అలాగే ఉండిపోయాడు రాణా, తలపై చేతులు ఉంచుకుని సుబేదార్ చేతులు తన భుజాలమీద పడే దాకా.

"ఇట్సాల్ రైట్ సార్! పని చక్కగా పూర్తయింది" సుబేదార్ మోకాళ్ళమీద కూర్చుని టన్నెల్ ద్వారంవైపు చూస్తున్నాడు గర్వంగా తల ఊపుతూ.

దిమ్మ పట్టాయి రాణా చెవులు.

తల పైకెత్తి చూసాడు—ప్రేలుడు ఫలితం తెల్సు

కోవాలన్న ఆత్రుతతో. పొగమంచుతో కూడిన దుమ్ము, ధూళి ముఖ ద్వారంవద్ద గింగురు తిరుగుతోంది కాని కొద్ది క్షణాల తర్వాత దుమ్ముకొట్టుకుపోయింది.

రాణా, తాను చూసిన దృశ్యాన్ని చూసి నవ్వ గలిగాడు. కొండరాళ్ళు ముఖద్వారాన్ని పూర్తిగా కప్పే శాఫ్ గోడ కట్టినట్లుగా.

యికముందు అక్కడ ముఖద్వారం ఉండేదని ఎవరూ గుర్తించలేరు....

నవ్వుతున్న సైలో చేతిమీది అభినందన పూర్వకంగా చేతో తడుతూ—రేడియో అందుకున్నాడు రాణా.

"హల్లో ప్రొఫెసర్ అశ్వత్థామా!"

సుబేదార్ పల్లంలోకి దిగి కప్పబడిన ముఖద్వారంకేసి నడుస్తున్నాడు.

టన్నెల్ కెదురుగా నిలబడి డామేజ్‌ని నిశితంగా పరీక్షించాడు.

తర్వాత సంతృప్తిగా వెనక్కు తిరిగి, రాణావైపు చూస్తూ బ్రొటనవేలు పైకెత్తాడు.

"హల్లో ప్రొఫెసర్! కెన్ యు హియర్ మీ?"

మరో రెండు క్షణాలు నిశ్శబ్దం....

అప్పుడు అశ్వత్థామ కంఠం "హల్లో....హల్లో.... రాణా!.... కెన్ యు హియర్ మీ?"

"యస్. ఐ కెన్ ప్రొఫెసర్."

"బ్రహ్మాండమైన ప్రేలుడు....అవునా?....యిటువైపు పనికూడా సంతృప్తిగా ముగిసింది. కాప్టెన్—దగ్గర్నుంచి పరీక్షించడం కోసం వెళ్ళాడు....బట్ ఫ్రం హియర్ ఇట్ లుక్స్ ఫైన్....నీవైపు ఎలా జరిగింది?"

"యిటువైపు ద్వారం అంగుళం కూడా ఖాళీలేకుండా

కంప్లీట్ గా సీలు చేయబడింది. సుబేదార్ సైలో దగ్గర్నుంచి ఎగ్జామిన్ చేసి ఓ.కే. గుర్తు యిచ్చాడు."

"ఎక్సలెంట్ ....ఎక్సలెంట్ .... నేనుకూడా ఇప్పుడు టన్నెల్ వైపు వెళుతున్నాను దగ్గర్నుండి చూడ్డానికి. ప్రేలుడుద్వారా ఏర్పడిన దుమ్ము ఇపుడే మాయమౌతోంది. ప్రేలుడు ఫలితాన్ని యిప్పుడు దగ్గరగా చూడగలుగుతున్నాను. ఎస్....ఎస్.... నేను దగ్గరకెళ్ళేకొద్దీ బాగా కనబడుతోంది....పల్లంలో నా క్రిందగా ఉన్న కెప్టెన్ నగర్వాలాను చూడగలుగుతున్నాను. అతను వెనక్కి తిరిగి నావేపు చూస్తున్నాడు....చేతులూపుతున్నాడు....గుడ్....గుడ్... ఐ థింక్ హి ఈజ్ హేపీ! తన రెండు చేతులతో కరచాలనం చేసుకుంటున్నాడు.."

స్పీకర్ లోంచి గరగరశబ్దం వినబడసాగింది.

దాన్ని ప్రొఫెసర్ నవ్వుగా గుర్తించాడు రాణా. తిరిగి అశ్వద్థామ కంఠం చెప్పసాగింది: "ప్రస్తుతం బ్లాకేజ్ ప్రక్కగా నడుస్తున్నాను. ముఖద్వారం బలంగా, దట్టంగా సీలు చేయబడింది. పదిహేను అడుగుల పైగా.... ఓ కాంక్రీట్ దిమ్మ వంకరగా తిరిగి ఉంది. అది....అది" టూవే రేడియో రెండుక్షణాలు మౌనం వహించింది.

మళ్ళీ పలికింది ప్రొఫెసర్ కంఠం. ఆ కంఠంలో కొత్తగా యేర్పడ్డ ఆరాటం, భయం గమనించకపోలేదు రాణా. "దేరీజ్ సమ్‌థింగ్!....అక్కడ....అక్కడ.... ముఖద్వారం పైకప్పులో ఉండే సిమ్మెంట్ దిమ్మపై నుంచి దుమ్ము పొగలు కక్కుతోంది....లేదు....దాని "వెనక" నుంచి....అది దుమ్మా?....మేఘంతాలూకు పొగా?...."

ఒక్కక్షణం నిశ్శబ్దం....

"లేదు!.... పొగమంచు క్లియర్ అయిపోయిందే యిక్కడ?.... ఖాళీ అయి వుండాలి.... నేను దగ్గరగా వెళ్ళి చూస్తాను.... అది వేగంగా బయటికి వస్తున్నట్లు కనబడుతోంది. ఆవిరి కక్కుతున్నట్లు.... యిప్పుడు దానికి దగ్గరగా వున్నాను. స్పష్టంగా చూడగలుగుతున్నాను కాంక్రీట్ దిమ్మ వెనుకభాగం...."

మళ్ళీ మాటలు తెగిపోయాయి.

...."యిక్కడ కన్నం వుంది!!"

రాణా అదిరిపోయాడు.

...."మైగాడ్!! పైకప్పులో ఓ ఖాళీ యేర్పడింది.... దెరీజ్ ఎ గాప్!.... విష మేఘం!!.... అది బైటికి తప్పించుకొంటోంది.... ఇది ఎలా సాధ్యం.... బాంబు ప్రేలుడు ఒత్తిడికి యిలా జరిగివుండాలి. బహుశా టన్నెల్ లోపల ఉండిపోయిన గాలి పొగమంచును నెట్టివేస్తూ వుండాలి. అదే అయ్యుండాలి. లేకపోతే విష మేఘం తప్పించుకోడం అసంభవం. హోలీగాడ్! దెరీజ్ ఎ లైట్!! కన్నం ప్రకాశిస్తోంది, తీవ్రమైన వెలుగుతో. కాంతి బైటికి వస్తోంది. మనం టన్నెల్‌లో చూసిన కాంతే యిది! పసుపురంగు కాంతి!! నో....నో....నో!...మైక్రోప్లాస్మా తప్పించుకుపోతోంది!.... అది మేఘంతో కల్సిపోయి ధారాళంగా బైటికి వస్తోంది!! ఐ మస్ట్ గెట్ అవే ఫ్రం హియర్! నేను దూరంగా పోవాలి ..."

జీవం కోల్పోతూ రేడియో అకస్మాత్తుగా మౌనం వహించింది.

రా....ణా....

....అనేక సంవత్సరాల తర్వాత....

మొట్టమొదటిసారిగా.... నేలమీద చతికిలబడి....

బిగ్గరగా....

ఏడ్వసాగాడు....

§ § §

"రాణా! ...సుబేదార్, సైలో!.... కెన్ యూ హియర్ మీ....?"

రాణా ఉలిక్కిపడి తలెత్తాడు.

ముందుకు వంగి రేడియో దగ్గరగా లాక్కున్నాడు. రిసీవర్ చలనం కోల్పోయిన తర్వాత—తను ఎంత టైం వృధా చేసింది తెలియలేదు రాణాకి.

కొద్ది క్షణాలే అయివుండొచ్చు ...కొద్ది నిముషాలు అయివుండొచ్చు....హతాశుడై కూలిపోయిన రాణా టైం గుర్తించలేదు.

విష మేఘం!....

ఆ పీడకలను వొదిలించుకునే మార్గంలేదా?

దాన్ని నాశనం చేయడంలో మనిషి ఎన్నటికీ సఫలం కాలేడా?

"హలో! నేను, రాణాని మాట్లాడుతున్నాను" ఆతృతతో పలికాడు స్పీకర్ లో, "అశ్వత్థామా?"

"కాదు. కాప్టెన్ నగర్వాలాని మాట్లాడుతున్నాను. స్పెషల్ వాన్ లో ప్రొఫెసర్ అశ్వత్థామ నా పక్కనే ఉన్నాడు. ఆయన కండిషన్ బాలేదు."

"వాట్ హాపెండ్?"

"మైక్రోప్లాస్మా! ...అది తప్పించుకు బైటపడింది.... ప్రొఫెసర్ వెహికిల్ దగ్గరగా పడుండడం గమనించాను. ఆయన ముందుగా తేలుకుంటూ వెళ్తున్న కాంతివంతంగా మెరిసే పదార్థాన్ని చూసాను. దూదిపింజాల్లాంటి మేఘంతో కల్సి అది కొట్టుకుంటూ వెళ్ళింది. బహుశా

ప్రొఫెసర్ మీదుగా అది ప్రయాణించి ఉండొచ్చు.

బరువుగా గాలి లోనికి పీల్చాడు రాణా. "ఈజ్ హి ఆల్ రైట్?"

"ఐ డోంట్ నో, ... మత్తుగా బెదిరిపోయినట్లు ఉన్నాడాయన....ఆయన్ని వాన్ లోకి లాగాను. కాని హెల్మెట్ తొలగించి పరీక్షించే రిస్కు తీసుకోలేదు. ఆయన పరిస్థితికి భయమే కారణమనుకుంటా .... అది తప్పించుకుని పారిపోయి తనవైపు రావడం చూసి షాక్ అయివుంటాడు. ఎనీవే, ఒక నిముషం క్రితం కోలుకున్నట్టు కన్పించాడు. దాన్ని అనుసరించమని చెప్పాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ, ఈసారి దాని ఉనికిని కోల్పోకూడదని చెప్పి హఠాత్తుగా వెనక్కి వాలిపోయాడు, స్పృహ కోల్పోయినట్లుగా. ప్రస్తుతం కొంచెం తేరుకుంటున్నట్టు అనిపిస్తోంది."

"నగర్వాలా! ప్లీజ్ బీ కేర్ ఫుల్" బ్రతిమాలాడు రాణా "ఆయన్కి ఆ వ్యాధి సోకి ఉండొచ్చు."

"నో__ఐ డోంట్ థింగ్ సో....ఈ దుస్తులు చాల దృఢమైనవి .... పైగా మాస్క్ ఎటాచ్ చేయబడ్డ హెల్మెట్ వుంది....ఆయన షాక్ తిని ఉంటాడంతే. ఏది ఏమైనా.... నేను ఆ మెరిసే పదార్థాన్ని....ఐ మీన్.... న్యూక్లియస్‌ని నీడలా వెంటాడుతున్నాను, నా దృష్టి పథంనుండి తప్పించుకోకుండా జాగ్రత్తపడుతూ. మేము ఎంతో దూరం పోలేదు. అర ఫర్లాంగ్....అంతే! అది ఎడంవైపు తె....రాణా!మాముందు పొగమంచులోంచి.... రెండు బిల్డింగ్స్‌లాంటి ఆకారాలు కనబడుతున్నాయి.... అవి....అవి....యస్ రాణా....గాస్ హోల్డర్స్ అవి.... గుండ్రంగా, వెడల్పుగా .... తాటిచెట్టంత ఎత్తులో

ఉన్నాయి గాస్ సిలిండర్స్!...."

రాణాకి ఆ ప్రాంతం గూర్చి బాగా తెలుసు. నాలు గైదుసార్లు అటువైపు ప్రయాణించాడతను. అది ఓ ఫాక్టరీ....సముద్ర తీరంలో వున్న గాస్ రిఫైనరీ.... 'బాంబే హై' లోని పెట్రోల్ తీసే సాగర్ సామ్రాట్ నుంచి కొన్ని వాయువులు గొట్టాలగుండా ఒడ్డుకువస్తాయి. దాన్ని మార్పులు చేసి, వంటగాస్ గా పరిశుభ్రంచేసి, బొంబాయి నగరమంతా సప్లయిచేస్తుంది ఆ కర్మాగారం. ONGC (నూనె మరియు సహజ వాయువుల కమిషన్) ఆధ్వర్యంలో నడుస్తోంది ఆ రిఫైనరీ. టాంకులు, టవర్లు వెండిరంగులో మెరుస్తుంటాయి, ఫాక్టరీ చుట్టూ. ప్రధానంగా రెండు బ్రహ్మాండమైన గాస్ టాంకులు ముందు భాగంలో ఉంటాయి సిలిండర్ ఆకారంలో పైకి.

నగర్వాలా చూసినవి అవే అయివుంటాయి. వాటి వెనుక చిన్న చిన్న టాంకులు ఉంటాయి. ఆ రిఫైనరీ సముద్రం వొడ్డున నిర్మించబడింది. దేశంలో వున్న గాస్ రిఫైనరీల్లో అది అన్నిటికంటే పెద్దది.

"రాణా! వాటీజ్ దిస్ ప్లేస్?"

ఆ కంఠం అశ్వథ్థామదిలా తోచింది రాణాకి.

"ప్రొఫెసర్! మీరేనా మాట్లాడేది?" ఎంతో ఆతృతతో అడిగాడు రాణా "ఆర్ యూ ఓ.కే. సర్?"

"ఎస్....ఎస్....కొంచెం నీరసంగా ఉంది—అంతే. యిప్పుడు చెప్పు! వేగంగా....ముందు ఉన్న స్థలం గురించి నీకేం తెల్సు?"

రాణా తనకు తెల్సున్నదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు....ఆ ఫాక్టరీ ఏమిటో....అవసరమైతే లోనికి యెలా వెళ్ళాలో....

"లోపలికి వెళ్ళక—తప్పదని అనుకుంటున్నాను" గంభీరంగా వినబడింది అశ్వత్థామ కంఠం "విష మేఘం, గుండెకాయ.... ఆ నూక్లియస్ అటువైపే ప్రయాణిస్తోంది... యెంత విచిత్రంగా ఉంది?? సాధారణంగా గాస్ మండే ప్రక్రియలో పెద్ద పెద్ద పరిమాణాల్లో కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ ఉత్పత్తి అవుతాయ్. ఈ వాయువులే మనచుట్టూ ఉన్న వాతావరణాన్ని కాలుష్యం చేస్తాయి. యిప్పుడు విషతుల్యమైన ఈ మెకోప్లాస్మా తను ప్రమాదంలో ఉన్నట్టు గ్రహించినట్లు ఆ వాయువుల పంచన చేయతోంది.... శక్తిని సరిచేసుకుని వాటి ద్వారా తిరిగి బలం పుంజుకోవడాన్కి...."

"....అహా! కాప్టెన్ నగర్వాలా నువ్ చెప్పిన సైడ్ రోడ్ గమనించాడు.... మేం ఇప్పుడు అందులోకి మలుపు తిరుగుతున్నాం....యిప్పుడు మేం ఆ గాస్ సిలిండర్స్‌కి దగ్గరయ్యాం. మా తలలమీద అవి బ్రహ్మాండమైన ఆకారాలతో కనబడుతున్నాయి. ముందు ఓ గేటుఉంది. మేం అందులోంచి వెళ్ళబోతున్నాం.... ఆc! ఇప్పుడు నూక్లియస్ కనబడుతోంది."

"వెరీజిట్ నా? ఎక్కడుందది?" అరిచాడు రాణా రిసీవర్లో.

జవాబుగా....సాడిపాడిగా నవ్వు వినబడ్డటనిపించింది రాణాకి. "ఎందుకు? ఎక్కడ ఉంటుందనుకున్నావ్ మిస్టర్ రాణా....గాస్ టాంకర్ల మధ్యగా వాతుకుని వుందది—యిద్దరు రాక్షస తల్లితండ్రుల మధ్య బుల్లి రాక్షసుడిలా."

రెప్ప వేయకుండా రిసీవరు వైపు చూసాడు రాణా.

అశ్వత్థామ కంఠంలో చపలచిత్తత, మార్పు... ధ్వనించాయి.

తిరిగి, వెనుదిరిగి వచ్చిందా కంఠం—చురుగ్గా, పదునుగా పలుకుతూ—

"....నగరమంతా సప్లయి చేయబడే ఈ గాస్‌లో ఏమేమి చేరి ఉన్నాయో నీకు తెల్సా రాణా?? నన్ను చెప్పనీ!....యాభై శాతం హైడ్రోజన్, యిరవై నుంచి ముప్ఫై శాతం—మిథేన్, ఏడునుంచి 17 శాతం కార్బన్ మోనాక్సైడ్....మూడు శాతం కార్బన్-డై-ఆక్సైడ్.. 8 శాతం నైట్రోజన్, రెండు శాతం హైడ్రోకార్బన్స్.. యివన్నీ కలగలిపిన విషపూరిత వాయువే ఆ గాస్. దాంట్లో యింకా ...." చెప్పుకుంటూ పోయాడు అశ్వత్థామ శ్రద్ధగా వింటున్న విద్యార్థికి—కెమిస్ట్రీ బోధిస్తున్నట్టుగా.

"అమోనియా, గంధకం, హైడ్రో సయానిక్ యాసిడ్, బెంజీన్....యింకా అనేక పదార్థాలు ఈ గాస్‌లో మిళితమై ఉన్నాయ్. యింకో మాటలో చెప్పాలంటే అతి సున్నితమైన, అతి తీవ్రమైన 'మందే' మిశ్రమం! ఒక విధంగా....పొరపాటుగా.... ఈ మైకో ప్లాస్మా మనకు సమస్యా పరిష్కారాన్ని సూచిస్తోంది.... ఏమంటావ్ రాణా?...."

రాణాని తీవ్రంగా కలతపరుస్తూ తిరిగి రేడియో మౌనం వహించింది, జవాబు యిచ్చే అవకాశం లేకుండా.

"హే భగవాన్...." గాభరాగా గొణుక్కున్నాడు రాణా. ప్రొఫెసర్ ఆ గాస్ టాంకుల్ని నిలువుగా పేల్చబోతున్నాడు—మైకోప్లాస్మా పదార్థంతో సహా!!

(ఇంకా వుంది)